

ఫ్రీ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న 14వ కోర్టు అదనపు జడ్జి సల్మాఫాతిమా

హయత్‌నగర్ కోర్టులో ఫ్రీ లోక్ అదాలత్

హయత్‌నగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కోర్టు ప్రాంగణంలో శనివారం ఫ్రీ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 14వ కోర్టు అదనపు జడ్జి సల్మాఫాతిమా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనవసర విషయాలలో గొడవలు పడి కేసులు పెట్టుకోవద్దని అన్నారు. ఏదైన సమస్య వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కేసులు పెట్టుకోవడం వల్ల డబ్బు, సమయం వృథా అవుతుందని అన్నారు. ఒక వేళ కేసులు నమోదు అయితే రాజీ కుదుర్చుకోవాలని అన్నారు. అందరు స్నేహభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో ఏడవ అదనపు కోర్టు జడ్జి సంకేత్‌మిత్ర, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కక్షిదారులు పాల్గొన్నారు.



పోషణమాస కార్యక్రమంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీడీపీవో ప్రతినిధులు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి: సీడీపీవో

వనస్థలిపురం, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో రేణుక అన్నారు. పోషణ మాస వారోత్సవాలను పురస్కరించుకుని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లో పోషణమాస వారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణుక మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇవ్వాలన్నారు. బాలింతలు, చిన్నపిల్లలు పోషకాహారం తీసుకోవడం వలన రక్తహీనత సమస్యలు రావన్నారు. అనంతరం పోషణ మాస వారోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడీపీవో సూపర్‌వైజర్ సావిత్రి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్, రాధాకృష్ణ, యాదగిరి, శ్రీనివాస్, మౌనిక పాల్గొన్నారు.

పార్కు స్థలాలను స్వాధీనం చేసుకోవాలి



మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ఎంసీఆర్ కాలనీలో మూడు వేర్వేరు చోట్ల గల దాదాపు 2,160 గజాల పార్కు స్థలాలను మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని రక్షణ కంచె నిర్మించాలని బీజేవైఎం బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం పార్టీ నాయకులు ఇల్లెందుల సాయిసంతోష్, శివప్రసాద్‌లతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. లేఅవుట్‌లో చూపించిన పార్కు స్థలాలను అన్యాక్రాంతం చేయడానికి కొందరు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారని, ఈ దృష్ట్యా వాటిని మునిసిపల్ ఆస్తిగా భావించి స్వాధీనం చేసుకోవాలని రామకృష్ణారెడ్డి అధికారులను కోరారు.

భక్తి శ్రద్ధలతో గణపతి హోమం

చంపాపేట, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం వేద పండితులు, అర్చకులు భక్తిశ్రద్ధలతో గణపతి హోమం నిర్వహించారు. వినాయకస్వామికి విశేషమైన రోజైన సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని హోమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్ వరసిద్ది వినాయక స్వామికి ప్రాతఃకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, అర్చకులు కందాళ సంతోష్‌కుమార్, శ్రీనివాస్, వేద పండితులు చంద్రకాంత్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.



విశ్వకర్మ భగవానుడి పూజల్లో నాగోల్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

శ్రీవిరాట్ విశ్వకర్మ భగవానుడి యజ్ఞ మహోత్సవం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ అయ్యప్పకాలనీ పరిధిలోని చలువ పోచమ్మ ఆలయం వద్ద శనివారం శ్రీవిరాట్ విశ్వకర్మ భగవానుడి యజ్ఞ మహోత్సవం, పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం జెండాను ఆవిష్కరించారు. నాగోల్ డివిజన్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొంపోజు నరహరిచారి, ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీజగదీశ్వరి, ఎం.తాతాచారి, పి.నర్సింహాచారి, బి.వరుణ్‌కుమార్‌చారి, కే జంగాచారి, రాజుచారి పాల్గొన్నారు.



మెగా వైద్యశిబిరం నిర్వాహకులతో జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులో మెగా వైద్యశిబిరం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టులో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, చర్మ పరీక్షలు, సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, సలహాలు ఇచ్చారు. దాదాపు 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శశిధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి, సురక్ష సేవా సంఘం అధ్యక్షుడు కిక్కర గోపీశంకర్ యాదవ్, డాక్టర్ నారి ఫౌండేషన్ ఫౌండర్ కీర్తనయాదవ్, పీవీ నర్సింహారావు, చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ డాక్టర్ సుధాకిరణ్, న్యాయమూర్తులు పట్టాభిరామారావు, పద్మావతి, ఆంజనేయులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.



సరూర్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జోస్ అలుకాస్ దిల్‌సుఖ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో రూ. లక్ష విలువైన స్టడీ మెటీరియల్, వివిధ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోస్ అలుకాస్ మేనేజర్ జితోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి పనులు

నాలుగేళ్లుగా సాగుతున్న పనులు

పూర్తయ్యేదెన్నడో..?

- ఆలయం మీదుగా నిర్మాణం చేపట్టవద్దంటూ అభ్యంతరాలు



అసంపూర్తిగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు



ఆలయం ముందు నిలిచిన పనులు

సైదాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూలై 2020లో అప్పటి మంత్రి కేటీఆర్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. 24 నెలల్లో స్టీల్ బ్రిడ్జి వాహనదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని కేటీఆర్ బహిరంగంగా ప్రకటించారు. కానీ నాలుగేళ్లు గడిచినా పనులు అసంపూర్తిగానే కొనసాగుతున్నాయి. చంచల్‌గూడ ప్రెస్ నుంచి సంతోష్‌నగర్ యాదగిరి థియేటర్ వరకు నాలుగు లైన్ల స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం స్ట్రాటజికల్ రోడ్డు డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్ఆర్‌డీపీ) కింద రూ.523.37 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబడుతుంది. ఇందులో రూ. 370 కోట్ల నిర్మాణ వ్యయం, రూ. 153.37 కోట్ల భూసేకరణ కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. దాదాపు 3.38 కిమీల మేర నాలుగు లైన్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. 88 పిల్లర్లపై బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. రీన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్(ఆర్‌సీసీ) డెక్ స్లాబ్‌తో స్టీల్ పియర్లు, స్టీల్‌పైర్ క్యాప్, స్టీల్ గిర్డర్లతో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఓవైసీ ఆస్పత్రి జంక్షన్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండడంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుంది. ముఖ్యంగా చంపాపేట చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే వారితో పాటు శంషాబాద్ విమానాశ్రయం, కేంద్ర రక్షణ రంగ సంస్థలకు, శ్రీశైలం, నాగార్జునసాగర్ వెళ్లే వైపు ప్రయాణం సులువవుతుంది. చంచల్‌గూడ, సైదాబాద్, ధోబీఘాట్, ఐఎస్‌సదన్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. అంతే గాకుండా ఐఎస్‌సదన్ నాలుగు కూడలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు మోక్షం కలుగనుంది.

అలైన్‌మెంట్ మార్పుతో వివాదం..

స్టీల్ బ్రిడ్జి ముందస్తు అలైన్‌మెంట్ ప్రతిపాదనను అధికారులు కొందరికి అనుకూలంగా మార్పు చేశారన్న ఆరోపణలు వివాదానికి దారితీశాయి. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం మీదుగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టవద్దంటూ మార్చి 5న సైదాబాద్ ప్రధాన రహదారిపై హిందూ సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు పెద్దఎత్తున నిరసన దీక్ష చేపట్టారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. రీ అలైన్‌మెంట్ చేసే వరకు పనులు అడ్డుకుంటామని నేతలు హెచ్చరికలతో పనుల ఆటంకం ఏర్పడింది. కానీ ఆలయ కమిటీ ప్రతినిధులతో అధికారులు సమావేశమై ఆలయాన్ని ప్రత్యామ్నాయంగా కొంత స్థలం మంజూరు చేసే విధంగా అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. రాజీ కుదిరితే బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్చాల్సిందే



ఆలయ పవిత్రతకు భంగం కలిగించే స్టీల్ బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్చాల్సిందే, లేకుంటే హిందూ సంఘాలతో ధర్నాలు చేపడుతాం. కొందరికి అనుకూలంగా జీహెచ్ఎంసీ, ఎస్ఆర్‌డీపీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు. మరోసారి సర్వే నిర్వహించి రీ అలైన్‌మెంట్ చేసేంత వరకు ఉద్యమం కొనసాగుతుంది.

\- సహదేవ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్



నిరసన దీక్షలో అఖిలపక్ష నేతలు, ఆలయ కమిటీ సభ్యులు(ఫైల్)

ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌గా బాలాపూర్ చౌరస్తా : ఎమ్మెల్యే సబిత

- అధికారులతో కలిసి చౌరస్తాలో పర్యటన

సరూర్‌నగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ఆర్‌సీఐ రోడ్డులో గల బాలాపూర్ చౌరస్తాను ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌లా మార్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. దీనిని మోడరన్ జంక్షన్‌లా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. బాలాపూర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నట్టు స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే సబిత ట్రాఫిక్, మునిసిపల్, పోలీసు తదితర విభాగాలకు చెందిన అధికారులతో కలిసి చౌరస్తాలో పర్యటించారు. చౌరస్తాకు నాలుగు వైపులా ఉన్న రహదారిలో ఆమె పాదయాత్ర చేశారు. ట్రాఫిక్ ఇక్కట్లు దూరం చేసేందుకు గాను ఎక్కడెక్కడ ఏమేం చేయాల్సి ఉంటుందో సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు.



బాలాపూర్ చౌరస్తాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా అధునాతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. చౌరస్తాలో అక్రమ పార్కింగ్ లేకుండా చూడాలని, వాహనదారులు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ కమిషనర్ బి.చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, ట్రాఫిక్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

- బడంగ్‌పేట్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛతను బాధ్యతగా భావిద్దాం.. ప్రతి ఒక్కరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం' అని బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ జి.రఘు, కార్పొరేటర్లు భీమిడి స్వప్నాజంగారెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం బాలాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో, బడంగ్‌పేట్‌లోని బట్టేల్‌గుట్ట పార్కులో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మునిసిపల్ పారిశుధ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి, అక్కడి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అంతా కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను సైతం కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, టీపీఎస్ లాలప్ప, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, బాలాపూర్ స్కూల్ హెడ్మాస్టర్ రామానుజరెడ్డి, నాయకులు గట్టు బాలకృష్ణ, బాబు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ బట్టేల్‌గుట్ట పార్కు వద్ద స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కమిషనర్ రఘు తదితరులు

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్: స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత సేవపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ పోటీలను ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్గానిక్ పంటలపై దృష్టిపెట్టండి : పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ పంటలపై అన్నదాతలు దృష్టిసారించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సేంద్రియ ఎరువులను వినియోగించి నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు రైతులు కృషి చేయాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ది ఎర్త్ సెంటర్‌లో శనివారం మహేంద్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆత్మీయ సమ్మేళనంలో ఆర్గానిక్ పంటల సాగుపై రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. సమ్మేళనంలో కలుషితం లేని ఆహార పంటల ఉత్పత్తులు, లాభసాటి వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ ఎరువుల వినియోగం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ పురుగు మందుల అవశేషాలు లేని సురక్షితమైన ఆహార ఉత్పత్తులు అందించాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. ఎర్త్ సెంటర్ ఆవరణలో స్వచ్ఛత సేవలో భాగంగా సీజీఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి పోచారం పలు రకాల మొక్కలు నాటారు. అనంతరం వ్యవసాయ పుస్తకాలను ఆవిష్కరించారు. సీజీఆర్ అధ్యక్షురాలు కోర్పోలు లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మహేంద్ర ఎఫ్‌పీవో డైరెక్టర్ పొలసాని పంకజ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.నర్సింహారెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిలర్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డి, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

2కిలోల గంజాయి స్వాధీనం

హయత్‌నగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో ఓ వ్యక్తి నుంచి 2 కిలోల గంజాయిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బొల్లారంకు చెందిన పసుపతి లోకేష్(25) శనివారం మధ్యాహ్నం హయత్‌నగర్ తొర్రూర్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో అతడిని అదుపులోకి తీసుకుని 2కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

యువకుడి అదృశ్యం



హయత్‌నగర్: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పసుమాముల గ్రామానికి చెందిన మెడెపు లలిత కుమారుడు భానుచందర్(27) శనివారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి లలిత శనివారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేస్తున్న చెన్నయ్య, బేర బాలకిషన్ తదితరులు

కులం పేరుతో దూషించిన వారిని శిక్షించండి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు జి చెన్నయ్య, తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపకుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన గణేశ్ నిమజ్జనోత్సవంలో సరూర్‌నగర్ చెరుకుతోట కాలనీకి చెందిన గణనాథుడిని నిమజ్జనం చేసేందుకు ర్యాలీ చేపట్టిన సమయంలో అరబిందో కళాశాల వద్ద జక్కిడి రఘువీరారెడ్డి, విజయ్, ప్రతీక్ వారి అనుచరులు తమను కులం పేరుతో దూషించడమే కాకుండా చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారంటూ పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను బెదిరింపులకు పాల్పడిన వారిని నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి శిక్షించాలని, కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే మాల సంఘాల ఆధ్వర్యంలో చలో ఎల్బీనగర్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు.

ఫిర్యాదు చేసిన వారిలో బూర్గుల వెంకటేశ్వర్లు, రమేష్, బీమ ముత్యాలు, ఆవుల రమేష్, యాదగిరి, రేకల నర్సింగరావుతో పాటు బాధితులు ఉన్నారు.



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి తదితరులు

మంత్రులను కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

- పాలకవర్గాన్ని అభినందించిన మంత్రులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలను శనివారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. నూతన పాలకవర్గానికి మంత్రులతో పాటు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, అంజయ్య, లక్ష్మి, మచ్చేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, నర్సింహ, మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఫార్మాసిటీ వద్దని సోనియా, రాహుల్‌కు లేఖ

- పోస్ట్‌మాస్టర్‌కు అందించిన రైతులు



లేఖను పోస్ట్‌మాస్టర్‌కు అందిస్తున్న కుర్మిద్దకు చెందిన రైతులు

యాచారం, సెప్టెంబర్ 21 : రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు మండలాల మధ్య ఫార్మాసిటీ ఏర్పాటు చేయొద్దని కోరుతూ శనివారం యాచారం మండలం కుర్మిద్దకు చెందిన రైతులు వినోద్‌రెడ్డి, మల్లేష్ తదితరులు ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు లేఖలు రాసి పోస్ట్‌మాస్టర్‌కు అందించారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ మాట మార్చి ఫార్మాసిటీ రద్దు చేసేదిలేదని చెప్పడం దారుణమన్నారు. సమస్య తీవ్రతను వివరిస్తూ కుర్మిద్దకు చెందిన పలువురు రైతులు ఫార్మాసిటీ రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ అగ్ర నాయకులకు లేఖలు రాశారు. శనివారం వాటిని పోస్ట్ చేయాలని పోస్ట్‌మాస్టర్‌కు అందించారు. ఫార్మాసిటీ రద్దు చేసేదాక పోరాటం కొనసాగిస్తామని రైతులు తేల్చి చెప్పారు.

29న బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సమితి ఎన్నికలు

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

సరూర్‌నగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సమితికి నూతన కార్యవర్గం ఎన్నిక నిమిత్తం ఈనెల 29వ తేదీన కార్పొరేషన్‌లోని ఎంసీఆర్ కాలనీలో గల శ్రీవాణిగాయత్రీ బ్రాహ్మణ భవనంలో ఎన్నికల అధికారి జి.రమాశంకర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు సమితి ప్రస్తుత అధ్యక్షుడు బి.రామ్మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యవర్గంలో పదవుల కోసం పోటీ చేయదలచుకున్న వారు నేడు(ఆదివారం), రేపు(సోమవారం) నామినేషన్లు దాఖలు చేయాలని ఆయన సూచించారు. 24న నామినేషన్ల పరిశీలన, 25న ఉపసంహరణ, అనంతరం అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు. 29వ తేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక నిర్వహించి, అనంతరం ఫలితాలు ప్రకటించనున్నట్టు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న సినీహీరో కార్తికేయ

సినీహీరో కార్తికేయ జన్మదినోత్సవం

ఎల్బీనగర్ : సినీహీరో కార్తికేయ గుమ్మకొండ జన్మదినోత్సవాన్ని శనివారం ఎల్బీనగర్‌లోని కీర్తన అనాథ, వృద్ధ, బాలుర, మానసిక వికలాంగుల ఆశ్రమంలో నిరాడంబరంగా జరుపుకున్నారు. వృద్ధులు, చిన్నారుల మధ్య కార్తికేయ కేక్ కట్ చేసి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆశ్రమంలో చిన్నారులకు కంప్యూటర్ విద్యకోసం అవసరమైన పరికరాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ రజని విఠల్‌రెడ్డి, డైరెక్టర్లు లోహితరెడ్డి, అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, సీఏఓ శేషారావు, కీర్తన ఫౌండేషన్ నిర్వాహకులు అనీల్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.